క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉ.10 గం నుంచి మ. 1 గం వరకు జేవీ కాలనీ, కేంద్రీయ విహార్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డీఎల్ఎఫ్ పరిసరాలు, డాగ్ పార్క్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు విద్యుత్ సరఫరాలో అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

మాతృభాషను మరవొద్దు

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



హఫీజ్‌పేట్ : విద్యార్థులు ఎన్ని భాషలు నేర్చినా మాతృభాషను మరవొద్దని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శుక్రవారం కొండాపూర్‌లోని విజ్ఞాన్ గ్లోబల్ జెన్ స్కూల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, విజ్ఞాన్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్‌పర్సన్ రాణి రుద్రమదేవిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండాలంటే యోగా చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సందీప్ క్రాంతి కిరణ్, ప్రిన్సిపల్ సీహెచ్ మంజుల, ప్రధానోపాధ్యాయులు వందన, కో ఆర్డినేటర్స్, వైస్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





చెట్లు ఎండి.. చెత్త చేరి..



లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీ పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో చెత్త చెదారం

లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీ పార్కు దుస్థితి

శేరిలింగంపల్లి: పార్కుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దీంతో కాలనీవాసులు కాలు మోపేందుకు జంకుతున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీలో నారాయణ జూనియర్ కళాశాల పక్కన ఉన్న పార్కును జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పార్కు గడ్డితో నిండిపోయింది. మొక్కలు ఎండిపోతున్నాయి. పార్కు ప్రహరీ ధ్వంసం అయింది. పార్కు చిల్డ్రన్ ఏరియాలో వస్తువులు తుప్పుపట్టిపోతున్నాయి. ఇక వాకింగ్‌ట్రాక్ ఆనవాలు లేకుండాపోయింది. పార్కులో గడ్డి పెరిగిపోవడంతో పాములు సంచారం ఉంటుందని స్థానికులు రావడం లేదు.

నీటికి కట కట...

పార్కు నిర్వహణకు నీరు అందించే పవర్ బోరు పని చేయకపోవడంతో నీటి కటకట ఏర్పడింది.దీంతో మొక్కలు ఎండిపోతున్నాయి. లక్షలు వెచ్చించిన పార్కు నిరుపయోగంగా తయారైంది. అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు పార్కును పట్టించుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



తుప్పు పట్టిన పిల్లల ఆటవస్తువులు



ధ్వంసమైన ప్రహరీ గోడ

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: కాలనీల్లో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టెలికామ్‌నగర్‌లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో నూతనంగా పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలని జలమండలి అధికారులను కోరామని తెలిపారు. కాలనీలో మంచినీటి సమస్య, మురుగు, దోమల బెడద గురించి స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



టెలికామ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు ధర్మగారి రవీందర్‌రెడ్డి, తిరుపతి, రంగస్వామి, రాజు, టెలికామ్‌నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై అవగాహన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జీహెచ్ఎంసీ, రాంకీ ఆధ్వర్యంలో గార్బేజ్ నిర్వహణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణపై అవగాహన లేకపోతే వాయు, నీటి, ఆహార కాలుష్యాలకు దారితీస్తుందన్నారు. ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రోడ్లపై చెత్త వేయకూడదని, స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేసేలా కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్, ఉపాధ్యాయులు బలరాం, శివకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ ,రాంకీ ఇంచార్జ్ గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

ఏ దేశమైనా సంస్కృతి ఒక్కటే





మాట్లాడుతున్న టర్కీ కాన్సులేట్ జనరల్ ఓర్హన్ యల్మన్ ఒకన్, ఆకట్టుకున్న ప్రదర్శన

మాదాపూర్: ఇరు దేశాలు భిన్నంగా ఉన్నప్పటికి సంస్కృతులు ఒక్కటే అని టర్కీ కాన్సులేట్ జనరల్ ఓర్హన్ యల్మన్ ఒకన్ అన్నారు. మాదాపూర్‌లోని ట్రిడెంట్ హోటల్‌లో శుక్రవారం కొన్య టర్కిస్ సూఫీ సంగీత బృందం నిర్వహించే ప్రదర్శనకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టర్కీ రాయబార కార్యాలయం, టైమ్స్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో తొలిసారిగా సేమ పేరుతో ఫిబ్రవరి 3వ తేదీన శిల్పకళావేదికలో ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. టర్కీ, హైదరాబాద్ గొప్ప చరిత్ర, సంస్కృతిని కలిగి ఉన్నాయన్నారు. సూఫీ సంగీతంలో భాగంగా నెయ్, కుదుం, తంబుర, తెఫ్ తదితర వాయిద్యాలను ప్రత్యేకంగా ఉపయోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ సీఈఓ కరణ్ బజాజ్, ట్రిడెంట్ హోటల్ జనరల్ మేనేజర్ ధీరజ్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, పాలకొల్లు
ఇ.పి.నెం.12/2021 ఇన్ ఓ.ఎస్.నెం. 296/2021

డిక్రీహోల్డర్:
రాజా బాల లక్ష్మణరావు — డి.హెచ్.ఆర్ / వాది
మరియు
రాజా భాగ్యలక్ష్మి — జె.డి.ఆర్ / ప్రతివాది
[illegible]

తేది: 13-01-2023
పాలకొల్లు

చైన్‌స్నాచింగ్ దొంగల అరెస్ట్

మియాపూర్ : రోడ్డుపై నడిచి వెళ్లే మహిళలను టార్గెట్ చేస్తూ.. బైక్‌పై వచ్చి బంగారు గొలుసులను లాక్కోని వెళుతున్న ఇద్దరు నిందితులను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం సీఐ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం ... మధ్యప్రదేశ్‌కు చెందిన మున్నా మోహితే బొల్లారంలోని చర్చికాలనీలో ఉంటూ చిరు వ్యాపారం చేస్తున్నాడు. మహారాష్ట్రకు చెందిన కరణ్‌పారియల్ మోహితే అతనికి స్నేహితుడు. స్థానికంగా ఉంటూ జల్సాలకు అలవాటు పడ్డారు. డబ్బు సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో హుడా ట్రేడ్ సెంటర్‌కు చెందిన రాజ్యశ్రీ లింగంపల్లిలోని మార్కెట్‌కు కూరగాయల నిమిత్తం వెళ్తుండగా, ఇద్దరూ బైక్‌పై వచ్చి మెడలోంచి మంగళసూత్రాన్ని లాక్కోని వెళ్లారు. అదే రోజు మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో చందానగర్ రెడ్డికాలనీలో నివాసముంటున్న లక్ష్మి అపర్ణ అపార్ట్‌మెంట్‌లో డ్యూటీ ముగిశాక, ఇంటికి తిరిగి వెళ్తుండగా సురక్ష హిల్స్ రోడ్డు నంబర్ 2 సమీపంలోకి రాగానే ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు లాక్కోని పారిపోయారు. దీంతో ఇద్దరూ వేర్వేరుగా ఈ నెల 25న ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా రెండు చోట్ల దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులు ఒక్కరే అని గుర్తించారు. ఈ క్రమంలోనే నిందితులు మున్నా మోహితే, కరణ్ పారియల్ మోహితే దొంగిలించిన బంగారు ఆభరణాలను బీరంగూడలోని ఓ బంగారు దుకాణంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం అందింది. దీంతో చందానగర్ పోలీసులు, ప్రత్యేక బృందాలు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో విచారించగా దొంగతనాలకు పాల్పడింది తామేనని ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి రెండు తులాల బంగారం, ఓ పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చెరువుల సుందరీకరణకు శ్రీకారం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్లలో చెరువుల సుందరీకరణలో భాగంగా మాదాపూర్, గచ్చిబౌలి డివిజన్లలో రూ.3.41 కోట్ల పనుల చెరువుల సుందరీకరణ కార్యక్రమాలకు శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా శంకుస్థాపన చేయనున్నారు. మాదాపూర్ డివిజన్‌లోని గుట్టలబేగంపేటలోని మెండికుంటను రూ.68 లక్షల వ్యయంతో గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంతిహిల్స్‌లోని కుమ్మరికుంటను రూ 8 లక్షల వ్యయంతో, గోపన్‌పల్లిలోని కోమటికుంటను రూ.2.65 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నారు.

రెహమాన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి హబీబుర్ రెహమాన్‌కు శుక్రవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో గణితం విభాగంలో రహమాన్ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ సయ్యద్ నజాముల్‌హసన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆయన 'ఇంటర్ ప్లానెటరీ ట్రాజెక్టరీస్‌లో బదిలీ కక్ష్యల రూపకల్పన' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆయనను పలువురు ఫ్యాకల్టీలు, విద్యార్థులు అభినందించారు.

ఏకాగ్రతతో, ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



విజేతలకు ప్రశంస పత్రాలను అందించిన రవికుమార్ యాదవ్

శేరిలింగంపల్లి: ఏకాగ్రతతో ప్రశాంతంగా పరీక్షలు రాయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మసీద్‌బండలోని జడ్పీహెచ్ఎస్‌లో పరీక్షా పే చర్చలో భాగంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే భయపడకూడదన్నారు. పరీక్షా పే చర్చలో ఇచ్చిన చిట్కాలను పాటించాలన్నారు. సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనంతరెడ్డి, బీజేపీ నాయకులు ఎల్లేష్, అనిల్ కుమార్ యాదవ్, రాధాకృష్ణ యాదవ్, ఆకుల లక్ష్మణ్, చింత రాజు, నర్సింహ్మ, కరణ్ తదితరులు పాల్గొన్నారు.


కేవీ హెచ్‌సీయూలో..



రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో శుక్రవారం పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. కేవి ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ వి.శోభన్‌బాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు తిలకించారు. అనంతరం 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.,

చందానగర్‌లో..

మియాపూర్: చందానగర్‌లోని జై జవహర్ హైస్కూల్, మండల పరిషత్ హైస్కూల్ ఉర్దూ మీడియం పాఠశాలలో పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోడీ విద్యార్థులకు ఇచ్చే సందేశాన్ని బీజేపీ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి వీక్షించారు. ఈ సందర్భంగా నవతారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రధాని మోడీ రచించిన ఎగ్జామ్స్ వారియర్స్ పుస్తకాన్ని చదవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, సహీనా , చందర్‌రావు, గౌస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చందానగర్‌లో విద్యార్థులతో మాజీ కార్పొరేటర్ బొబ్బ నవతారెడ్డి

నల్లగండ్లలో నటి ఐశ్వర్య సందడి



సెలూన్‌ను ప్రారంభిస్తున్న నటి ఐశ్వర్య

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని నల్లగండ్లలో నటి ఐశ్వర్య సందడి చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన హబీబ్స్ హెయిర్ అండ్ బ్యూటీ సెలూన్‌ను శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందం ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తుందన్నారు. హబీబ్స్ వ్యవస్థాపకులు హబీబ్ అహ్మద్, మాస్టర్ ఫ్రాంచైజీలు గౌతమ్ మంఘనాని, ప్రశాంత్‌లు మాట్లాడుతూ ఈ రంగంలో మహిళా యువ వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు ఫ్రాంచైజీలను కూడా ఇస్తున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం చేపడుతున్నట్టు రీజినల్ కోఆర్డినేటర్ కళ్యాణి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పీహెచ్‌డీ, నెట్ అర్హత గల అభ్యర్థులు జనవరి 31లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గణితం–1, కామర్స్–1, కంప్యూటర్ సైన్స్–2, కెమిస్ట్రీ–1, జువాలజీ–1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మరింత సమాచారం కోసం 9912934830, 9000049142 సంప్రదించాలి.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సీడీపీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు విఠలమ్మ, రాణి, జమున, సునీత, మంజుల, గాయత్రి, ప్రమీల, ఇందిర పాల్గొన్నారు.

టెక్ విష్ గ్రూప్ అత్యాధునిక కేంద్రం ప్రారంభం

రాయదుర్గం: గ్లోబల్ కార్పొరేషన్ కంపెనీ టెక్ విష్‌గ్రూపు అత్యాధునిక కేంద్రాన్ని రాయదుర్గంలో ప్రారంభించింది. శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, సీఆర్ఎఫ్, బిల్డింగ్స్ ఇంజనీర్ ఇన్ చీఫ్ గణపతిరెడ్డి, టెక్ విష్ గ్రూప్ వ్యవస్థాపకుడు, చైర్మన్ విష్ణురెడ్డి, ఆంత్రా ఇన్ కార్పొరేషన్ సీఈఓ నవీన్ యర్రగొండు పాల్గొన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు విష్ణురెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరించడంపై ఎల్లప్పుడు దృష్టి సారిస్తున్నామన్నారు. 2024 నాటికి వెయ్యి కంటే ఎక్కువ ఉండేలా ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేస్తామన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఏఎంసీ వాహిద్ అలీకి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మియాపూర్ : నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన భవనాల్లో విచ్చలవిడిగా కళాశాలలు, హాస్టళ్లు నడుపుతున్నారని, వాటికి ఫైర్ సేఫ్టీ కూడా లేదని, చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మిద్దెల మల్లారెడ్డి చందానగర్ సర్కిల్–21 ఏఎంసీ వహీద్ అలీకి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే ఎవరు బాధ్యులు అని అన్నారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్' అనే అంశంపై మోటివేషనల్ స్పీకర్ ముంబాయికి చెందిన ఈవి గిరీష్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

ప్రభల తీర్థం వేడుకలు ప్రారంభం





శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో ప్రభల తీర్థం వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా మొదటి రోజు బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. పల్లె ఆటలు ఆడుతూ మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాయదుర్గంలో అధికారుల పర్యటన



రాయదుర్గం: రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాలలో శుక్రవారం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పర్యటించారు. ముఖ్యంగా నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనులను, రాయదుర్గం నుంచి గచ్చిబౌలి వరకు అర్బన్ సీటింగ్ పనులను రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాలలో ఫుట్‌పాత్ నిర్మాణ పనులను జోనల్ కమిషనర్ శంకరయ్య, జీహెచ్ఎంసీ యూబీడీ అదనపు కమిషనర్ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ వెంకన్న, ఈఈ శ్రీనివాస్, యూబీడీ మేనేజర్ యూసుఫ్‌పాషా, ఏఎంఓహెచ్ నగేష్‌లు పరిశీలించారు.